# మంచి రోజులు

అవి మంచిరోజులు. మధురమైన రోజులు.

పదిమందితో కలిసి పంచుకునే కష్టాలు మధురంగానే ఉంటాయిమరి.

*  *  *

అప్పటికే బాగా రాత్రయిపోయింది. నీలాకాశం, నిండైన వెన్నెల, అడవి నిటారుగా నిద్రపోతోంది.

వేసవి సెలవుల్లో చేయాల్సింది విహారయాత్రకాదు. విలేజ్ క్యాంపెయిన్ అంటూ బయలులదేరిన తొమ్మిదిమంది గల విద్యార్థి బృందానికి అదే మొదటిరోజు.

నాలుగురోజుల రాజకీయ పాఠశాల ముగించుకుని తిన్నగా ఆ అడవిలోని పల్లెకు వచ్చినట్టున్నారు. నడిచినడిచి అందరి కాళ్ళు పీకుతున్నాయి. ఆపూట తిండి దొరకలేదు. తాము పెట్టిన మీటింగ్‌వినడానికి వచ్చినవాళ్ళు వచ్చినట్టుగానే వెళ్ళిపోయారు. అక్కడ కొనుక్కుతిందామన్నా ఏదీ దొరకదు. దొరికినా అలా కొనుక్కుతినకూడదని నియమం పెట్టుకున్నారు. తుండుగుడ్డలో చాకలివాళ్ళలా అన్నం అడుక్కుందామన్నాడు ఆ బృందం కమాండరు వెంకన్న. వాళ్ళకది కొత్త. కాలేజిలో చదువుతున్న కుర్రకారాయె. అది కొంచెం సిగ్గపించినట్టుగా వుంది. వెనకాముందయ్యారు అంతలో పుణ్యకాలం కాస్తా గడిచి పోయింది. అడవితోపాటు ఆ పల్లెకూడా నిద్రలోకి జారుకుంది.

వాళ్ళకిది కొత్త. వాళ్ళకివన్నీ కొత్తే, ఆ మనుషులూ కొత్త. ఆ అనుభవమూ కొత్త. వెంకన్నకు ఆ కమాండరు బాధ్యతా కొత్తే. ఇంతకు ముందోసారి యిలా వెళ్ళినపుడు అంతా హాయిగా గడిచిపోయింది. అవన్నీ రైతుకూలీ సంగాలంటే తెల్సిన వూళ్ళాయె. ఇవి కొత్త ఊళ్ళు. ఎవరికి సంగం గురించి పెద్దగా తెలియదు. అన్ని కష్టాలే.

ఎవరికీ నిద్రొస్తున్న జాడలేదు. ఓవేపు ఆకలిగా వుంది. మరోవేపు ఉత్సాహంగా వుంది. ఆ వాతావరణం ఎంతో హాయిగా వుంది.

వెంకన్నకు ఏమీ తోచడంలేదు. నిద్రరాక ఏదో ముచ్చట మొదలెట్టాడు. క్రమంగా అది చిన్నప్పటి ముచ్చట్ల ముచ్చటగా మారిపోయింది. ఆ వుత్సాహంలో అది రాత్రనీ, యిది ఆకలి అనీ, అది కొత్తనీ. యిది పాతనీ అన్నీ మరచిపోయారు.

అదంతా వింటుంటే రవికి ఏదోలా వుంది. గలగలా పారే ఏరు మూగనోము పట్టింది. అబ్బో వాళ్ళవి ఎంత గొప్ప అనుభవాలో ! పాతబడ్డారనుకున్నవాళ్ళే కొత్తవాళ్ళలా కన్పిస్తున్నారు.

వాళ్ళకూ తనకూ మధ్య యింతదూరం వుందా!

రవికి తమకన్నా కొంచెం మెరుగ్గా బతికేవాళ్ళన్నా బిడియమే. ఒక రకమైన భయంకూడా. తనవంతొచ్చేసరికి మాట పెగల్లేదు.

నిజమే. గతం కొందరికి మధురంగా వుంటుంది. కొందరికది సింద్‌బాద్ సాహసాల్లానూ వుంటుంది. గట్టెక్కిన కష్టాల్ని అలా తలచుకున్నా మధురమే. కాని తనవి గట్టెక్కిన కష్టాలుకాదు. మరిచిపోవాలనిపించే జ్ఞాపకాలు మధురంగా ఎలా వుంటాయి మరి !

మరీమరీ బలవంతపెట్టడంతో భయంభయంగా నోరువిప్పాడు రవి.

* * *

ఆ గుడిసె కాజీపేట రైల్వేస్టేషన్‌కి కేకపెట్టు దూరంలో వుంది. ఆ వీధి మురికిగా వుంది. మురుక్కాలువలు రోడ్డుమీద అక్కడక్కడ మడుగుకట్టి మరీ మురికిగావుంది. వీధిదీపాలుసైతం మురికిగా మినుకు మినుకుమంటున్నాయి.

ఆ గుడిశె తలుపు ఓరగా వేసివుంది. ఆ తలుపు సందులోంచి ఓ వెలుగుచార వాకిట్లోకి ప్రసరిస్తోంది. అది ఉదయంనుంచి రవికోసమే ఎదురుచూస్తున్న అమ్మమ్మ చూపులా మసకమసగ్గా వుంది.

పొద్దున బడికంటూ వెళ్ళిన రవి మళ్ళీ యిదే రావడం. కళ్ళు పీక్కుపోయాయి. డొక్క లోపలికి ఈడ్చుకుపోయింది. ఆకలిగా వుంది. అలసటగా వుంది. ఏదో మగత కమ్ముతోంది. చిరిగిన నిక్కరు జారిపోతోంది. చేతిలోని నాలుగు పుస్తకాలే మోపెడు బరువై భుజంమీద ఆన్చుకున్నాడు. కాల్లు వూరకే కూలబడిపోతున్నాయి.

ఉదయం స్కూలు పిల్లలు ఊరేగింపు తీశారు. అందర్లో రవీ వున్నాడు. అంతలో లాఠీఛార్జి జరిగింది. భయంతో వురికి వురికి తోవ తప్పిపోయాడు. హన్మకొండ, వరంగల్ అంతా తిరిగి తిరిగి అలిసిపోయాడు. ఎవర్నయినా అడగాలంటే భయమూ, సిగ్గూ. పొద్దున్న తిన్న చద్దన్నం ఇంతదాకా వుంటుందా! తిన్నాక అరగంటకే ఆకలి మొదలైంది. ఓ క్లాసుమేటు కల్సి ఓ మిరపకాయ బజ్జీ తినిపించాడు. తోవ తెలిసింది. కాని మరో భయం పట్టుకుంది, తనకోసం పోలీసులు యింటికి పోలేదు గదా! వెంకన్న కోసం అలాగే వచ్చారోసారి, ఆ చిన్నిబుర్రకి ఏంచేయాలో తోచలేదు. అదిగో ! ఇదీ రావటం!

మడుగుకట్టిన మురికిలో అలవాటుగా ఆ యిటుకలమీద అడుగేయబోయాడు. కాలుజారి నీళ్ళు మోకాలుదాకా చిందాయి. తాను పడినా ఫర్వాలేదు పుస్తకాలు పాడవకూడదని గట్టిగా పుస్తకాల్ని అదుముకున్నాడు రవి. కూడదీసుకుని మరి రెండడుగులు వేసి అలవాటుగా పిలిచాడు. ఆ పిలుపు మరీ నీరసంగా వుంది. మళ్ళీ పిలిచాడు. అమ్మమ్మ పలకలేదు. తలుపు తోసుకుని వెళ్ళాడు.

తమ్ముడూ, చెల్లీ అన్నకోసం చూసిచూసి అడ్డదిడ్డంగా పడి నిద్రపోయారు. అమ్మమ్మ రవికోసమే ఎదురుచూస్తూ అలాగే గుంజకొరిగి కునికిపాట్లు పడుతోంది. అలికిడికి ఉలికిపాటుతో కళ్ళు తెరిచింది. పోయిన ప్రాణం తిరిగివచ్చినంత సంతోషంతో బూదవ్వ కళ్ళు మిలమిల మెరిశాయి. ఉదయంనించి వీడికోసం కంగారుపడుతోంది. పోలీసులు పట్టుకుపోయారేమోనని ఎంత తల్లడిల్లిందో.

తనదగ్గర వున్నంతకాలం వీళ్ళకు ఏది జరిగినా తననే అంటారు. పాలగాడేమో వున్న

కాడ వుండదాయె. ఎటెటో తిరుగుతాడు. ఎవలెవలతోనో దోస్తు చేస్తాడు. వీనికేం? తనకొచ్చిందిచావు. తాను ఎంత భయపడిపోయింది! తాను రోజులాగే మరమరాల (పేలాల) బెల్లం వుండలు అమ్మబోయింది. ఆ వూరేగింపు కేసి యాధాలాపంగా చూసింది. ఇంత చిన్న పొలగాన్లు ఎంత గట్టిగ ఒర్రుతున్నర్రో అని ఆశ్చర్యపోయింది. అంతమందిలో తన మనుమడూ వున్నాడు. ఎందుకో క్షణకాలం మురిసిపోయిందికూడా. కాని అంతలోనే హఠాత్తుగా లాఠీఛార్జి జరిగింది. పాలుగారే పసిపిలగాన్లమీద అంత ఘోరంగా విరుచుకుపడతారని ఏం తెల్సు? క్షణకాలం కాళ్ళుచేతులు భయంతో వణికాయి. పగిలిన జిల్లేడుపత్తి గాలికి ఎగిరినట్టుగా పరిగెత్తారు పిల్లలు. తనను ఎవరయినా ఢీకొడితే పేలాల వుండలు నేలపాలవుతాయని రెండడుగులు వెనక్కి వేసింది. అంతే రవి కన్పించలేదు. ఎటు వురికాడో తెలియదు. మళ్ళీ యిదీ రాకడ! రవి ఒళ్ళంతా ఆప్యాయంగా తడిమింది బూదవ్వ. అమ్మమ్మ స్పర్శతో రవికి ఒళ్ళంతా వింత అనుభూతి. అంతదాకా రాని కన్నీళ్ళు ఒక్కసారిగా కళ్ళలో నిలిచాయి. బూదవ్వ వాడి కళ్ళు తుడిచి తన కళ్ళూ తుడుచుకుంది.

కాళ్ళు కడుక్కుని అన్నంకోసం కూర్చున్నాడు రవి. ఆ అలికిడికి లక్ష్మి కళ్ళు తెరిచింది. అన్న వచ్చాడని సంతోషంగా లేచికూర్చుంది. కళ్ళు మూతలుపడ్డంతో మళ్ళీ ఒరిగింది. బూదవ్వ రెండు పేలాల ఉండలు రవి చేతిలో పెట్టింది. రవి వాటికేసి అదోలా చూశాడు.

"అన్నం వండలేదుర!" బూదవ్వ గొంతు నిర్వేదంగా వుంది.

"అంటే? తమ్ముడు చెల్లెలు కూడ ఉపవాసమే పడుకున్నారన్న మాట!" బాధగా వాళ్ళకేసి చూశాడు రవి.

"ఎంజెయ్యాలెర? యియ్యాల్ల మీ బళ్ళు నడువలేదుగదర. ఏం అమ్మలేదు."

మారు మాట్లాకుండా అవి పరపరా నమిలేశాడు రవి. కడుపు నిండా నీళ్ళు పట్టించాడు. చెల్లెల్ని కొంచెం జరిపి ఆపక్కనే ఒరిగాడు.

ఆకలికి నిద్రరావడంలేదు. ఒళ్ళంతా పచ్చిపుండులా వుంది. అసహ్యంగానూ వుంది. స్నానంచేస్తే బావుండుననిపిస్తోంది. ఇంట్లో నీళ్ళు లేవు. సర్కారు బావిమీద బొక్కెన వుండదు. పక్కింటి చిన్నమ్మను లేపాలి. సబ్బుగూడా లేదు. అదయిపోయి నెలైపోయింది. ప్చ్. పోనీ వేన్నీళ్ళతో కొంచెం కాపడం పెట్టుకుంటే బావుండు. కాని ఈ దెబ్బలు అమ్మమ్మ చూస్తే లేనిపోని పీకులాట. ఇక రాత్రంతా ఏడుస్తూ కూర్చుంటుంది. దాంతో వీళ్ళద్దరూ లేస్తారు. ఏడ్పుందుకుంటారు. అదంతా ఎలాగో వుంటుంది. తనకూడ్దా ఏడుపొస్తుంది. కనక అమ్మమ్మకోసమైనా నిద్ర నటించకతప్పదు. అటుయిటు పొర్లాడు రవి.

బూదవ్వకూడా అదే స్థితిలో వుంది. నిద్ర రాకున్నా కళ్ళు మూసుకుంది. మనస్సులో గతమంతా సుడులు తిరుగుతోంది.

*　　　*　　　*

వీళ్ళు తన గుడిశెలో చేరి రెండేళ్ళపైన అయింది. వీళ్ళ బరువు బాధ్యత పైబడి ఏడాదిపైనే అయింది. అల్లుడూ కూతురూ వీళ్ళని ఇక్కడ వదిలేసి పొట్ట చేతపట్టుకొని దేశాలు తిరుగుతున్నారు. అక్కడ ఏ వూళ్ళో ఎన్నాళ్ళుంటారో తెలియదాయె. పిల్లలను వెంట తీసికెళ్ళడం ఎలా వీలవుతుంది? వాళ్ళకు కొంచెమైనా చదువు అబ్బాలంటే ఒకచోట కుదురుగా వుండాలి. వాళ్ళ ఆలోచన మంచిదే, కాదన్నదెవరు? కాని ఖర్చులకు సరిపడా డబ్బు పంపకపోయిరి. వీళ్ళని పొమ్మనలేదు. ఉండమనలేదు. తనకు మాత్రం తోడుగా ఎవరున్నారని?

ఎదిగిన కొడుకులు చెట్టుకొకరు పుట్టకొకరయ్యారు. పెద్దకోడలు ఎవర్తోనో లేచిపోయింది. దాంతో పెద్దవాడి బతుకు ఆగమైపోయింది. ఎక్కడున్నాడో తెలియదు. చిన్నోడు ఎక్కడో దూరాన గదగ్‌లో ఉంటున్నాడు. గ్యాంగ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అక్కడి పిల్లనే చేసుకుని అక్కడి మనిషైపోయాడు. ఎప్పుడో ఓసారి అలా వస్తాడు. ఇలా వెళతాడు. వాడికిద్దరు పిల్లలు. వాడి బతుకు వాడిదైపోయింది. ఇక మిగిలింది ఒకతే కూతురు. ఎంతో దూరం అని బయపడ్తానే యిచ్చింది. ఇక్కడా? అక్కడా? తాలూకాలు దాటి వరంగల్ జిల్లా సరిహద్దులు దాటి కరీంనగర్ జిల్లాలో ఓ మారుమూల పల్లెకిచ్చింది. వాళ్ళకు సొంత వ్యవసాయం లేకపోయినా మంచిగానే బతుకుతారనుకొంది. తన స్థాయికి అంతకుమించి అయ్యిందికాదు.

అదేందోగాని దగ్గరుండాల్సిన కొడుకులు దూరమయ్యారు. కూతురు ఎంతదూరాన వున్నా యిక్కడికి వచ్చి చేరుతోంది. ఇచ్చిన్నించీ యివే కష్టాలు. అవి మొన్నటిదాకా వేరే తీరు. సంగాలంటూ మొదలయ్యాక యివి యింకో తీరు. ఎటుచేసినా కష్టాలు తప్పవాయె. మోదుకుచెట్టుకు ఎప్పుడూ మూడాకులే. బతుకులో ఏం వుందిక? అల్లున్ని అట్లా అయిదారుసార్లు లాకప్పులో వేసిరి. కంటికేడు ధారలుగా ఏడ్చింది కూతురు. సంగాలొద్దని ఈ ముసల్ది చెపితే వినేటోడేనా ఈ అల్లుడు ?

ఆఖరికి అన్నీ వదులుకొని ఈ గుడిశె చేరిరి. ఇక్కడ ఎంతో బతిమాలితే హరిజన హాస్టల్లో పని దొరికె. అది సర్కారు నౌకరీ ఏంకాదాయె! పని పెరిగిందని పెట్టుకున్న రోజువారీ కూలి అది. పిల్లలకింత అన్నం దొరుకుంతుందని ఆశపడ్డారాయె. మొహం చూసినకాడ వచ్చేయేడయినా ఒక్కడినన్నా హాస్టల్లో ఉద్యోగంలోకి తీసుకుంటారని వుండె. అందుకే ఎంత పనయినా చేశారు. కాని దొరకలేదు. ఏదో జరిగి వార్డెన్ సస్పెండయి వెళ్ళిపోవడంతో ఆ పనీ పోయింది. చిల్లర పనులేవో చేస్తూ పొట్టగడుపుకొస్తున్నారు. అప్పుడే రావాల్నా అన్ని కష్టాలు? కరీంనగర్ జిల్లా నుండి కాజీపేటలోని ఈ గుడిశెను జాడదీసుకుంటూ పోలీసులు ప్రత్యక్షమైరి. ఈ ముసలిదాని ప్రాణానికి పిల్లలను యిక్కడే వదిలి ఏదో పని దొరికిందని ఎక్కడికో వలసపోయారు. అలా పోయి ఏడాదిపైనే అయిపోయె. ఎపుడు డబ్బు సరిగ్గా పంపింది లేదాయె.

వీళ్ళను సాదడం వాళ్ళిద్దరికీ చాతకాదుగాని ఈ ఒక ముసల్దానికెట్లా చాతనవుతుందనుకుంటున్నారో! మునుపటి కాలం కాదాయె. బెల్లం పేలాల ముద్దలు యిపుడు ఎవరు కొంటున్నారని? కొత్తకొత్త చాక్లెట్లూ బిస్కట్లూ అయిస్‌క్రీములూ రావట్టె. పల్లికాయ, బఠానీ చాక్లెట్లు అమ్మితే అన్నంలేని రోజు సగం వీళ్ళే దిగబోసిరి. అయినా ఏదమ్మినా ఏపాటి గిట్టుబాటవుతోందని? దీనికే ఎంత పోటీ అయిపోయె. కొత్తకొత్తోల్లు రావట్టిరి. ఉరికి ఉరికి అమ్మవట్టిరి. అమ్మకపోతే ఏం చేయడం. ఏదైనా అమ్ముకుతిందామన్నా మెడమీదైనా ఏంలేకపోయె. ఉన్నకాడికి అమ్మిపెడితేనేగదా అల్లుడు జైల్లోంచి విడుదలైంది! ఇంకా ఏముంది తనదగ్గర? ఈ గుడిసె, ఈ గిన్నెలు దప్పా! ఎవరికని చెప్పుకోను? చెప్పుకుంటే వాల్లేదో పెడ్తున్నట్టు తిడ్తారు. ముసల్దాని ప్రాణానికి తగరాని కంపతీర తగలబడ్డారనీ, జిట్టిరేగు కంపలా పట్టుకుని వదలరనీ. పొలగాన్లు ఆకలితో ఎంత తల్లడిల్లుతున్నారో పాపం. ఏడిస్తే పిల్లగాన్లు జమనుకుంటారు. కళ్ళు తుడుచుకుంది బూదవ్వ.

*　　　*　　　*

కొంగుతో కళ్ళొత్తుకుంది బూదవ్వ. అయినా ఆగని దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికింది.

అమ్మమ్మ వెక్కిళ్ళు విన్పించి రవి కాళ్ళు ముడుచుకున్నాడు. నిద్రలోలాగ అటుకేసి ఒత్తిగిల్లాడు. అలా రవికి ఎపుడు నిద్రపట్టిందో తెలియదు. ఏదో పీడకల పడ్డట్టయింది. అమ్మను నాన్న కొడుతున్నాడట. అమ్మ బాగా ఏడుస్తోందట. చటుక్కున లేచాడు రవి. వీధిలోంచి ఏడ్పులు పెడబొబ్బలు విన్పిస్తున్నాయి. అదిపక్కింటి చిన్నమ్మ గొంతు.

"నో+రుముయ్యి. మూస్తవా లేదా? లం..... ముండ, ఎంతకని కష్టపడాలె? తెచ్చింది తెచ్చినట్టు మాయం జేస్తున్నవ్."

"ఏందయ్య మాయమయ్యేది ? రత్నాలు తెచ్చిపోస్తున్నావ్? పూటకు చారెడు బియ్యం గతిలేవు. నేను నెలరోజుల్నుంచి కూసుండి తింటున్నని నీకు కండ్లమంట. గందుకే గీ ఆపరేషన్ నిన్ను చేసుకొమ్మన్న. అయితేంది ? ఛస్తేఛస్తి. బతికితే బతికితి. రేపట్నుంచి నేనుగూడ పనికి పోతతియ్య."

"నీతల్లి, ఇగ నువ్వు జేస్తెనే యిరుగవడ్తది. బాలెంతముండకు ఎంత రోషమో చూడున్రి."

నిద్ర లేచినవాళ్ళు ఏదో సర్దిచెప్పి వెళ్ళిపోయారు. రవి ఆకలిగా పేలాల వుండల బుట్టకేసి కదలబోయాడు. అమ్మ కదిలినట్టయింది. ఉసూరుమన్నాడు.

రవి మళ్ళీ పడుకున్నాడన్నమాటేగాని నిద్ర రావడంలేదు. అమ్మా నాన్న కళ్ళల్లో మెదులుతున్నారు. మునుపు నాన్న కూడ అమ్మను యిలాగే కొట్టేవాడు. అమ్మ యిప్పుడెట్లా వుందో? ఎన్ని రోజులైపోయిందో చూడక. ఒక్క ఉత్తరమైనా రాయలేదు. పైసలయినా పంపరు. అక్కడికయినా తీసుకుపోరు. ఇక్కడ పడుకొనుటానికయినా సరిగ్గాలేదు. అంతా యిరుకిరుకు, గుంతలు గుంతలు, ఎటు కదిలినా నొప్పి. పుస్తకాల ధరలు నిజంగానే దిగుతాయనుకుంటే గిట్లయిపోయె. అమ్మో ! నొప్పి. అలా ఏ వేళకు మళ్ళీ కన్నంటుకుందో!

లేచేసరికి సర్కారు బావిమీద గిలకలు కిర్రుకిర్రుమంటున్నాయి. బావికాడ బిందెలు బరబరమంటున్నాయి. ఆనందూ, లక్ష్మీ అప్పటికే స్నానాలు ముగించినట్టున్నారు. ఇంట్లో గిన్నెల అలికిడి మాత్రం లేదు.

బడికి వేళవుతోంది. ఆనందు, లక్ష్మి ఆకలిగా అటుయిటూ చూస్తున్నారు. ఆ వీధి పిల్లలు పుస్తకాలు తీసుకుని వెళ్ళిపోతున్నారు. ఆనందు కోసం వాడి ఫ్రెండొచ్చాడు.

"నేనింక తినలే. నువ్వు పో."

వాడు గుంద్రంగా తలాడిస్తుంటే రవికి ఓవేపు ఎంతో ముద్దొస్తోంది. మరోవేపు కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

"మనిష్కో పేలాలముద్ద యిస్తగని ఈ ఒక్కపూట బడికిపోన్రి. పగటీలి బియ్యం తెస్త."

లక్ష్మి మౌనంగా పుస్తకాలు సర్దుకుంది. ఆ కళ్ళనిండా నీళ్ళు. ఏ క్షణంలోనయినా రాలడానికి సిద్ధంగా వున్నాయి. చేత్తో తుడుచుకుంది. ఆనంద్ ఆకలికి తాళలేక ఏడుపందుకున్నాడు. రవి కడుపు వెన్నుకంటుకుపోతోంది. ఓసారి చెల్లెలుకేసి, తమ్ముడికేసి చూశాడు. వాళ్ళ కళ్ళల్లోకి చూసి తలదించుకున్నాడు రవి. కొంతసేపటికి ఎలాగోలా ధైర్యంచేశాడు.

"అమ్మమ్మా ? ఇపుడు నీ దగ్గరెంతున్నయే?"

"నాదగ్గరెక్కడున్నయిరా ?"

"నీయవ్వ!" అంటూ మొదటిసారిగా తిరగబడ్డాడు రవి. బొడ్లో సంచిని లాక్కున్నాడు.

ఆ వూపుకి బూదవ్వ అడ్డంపడిపోయింది. సంచీ కింద దులిపాడు. అంతా చిల్లరే. తొంభయి పైసలు!

"నీయవ్వ! పావుకిలో బియ్యం వస్తాయి" అంటూ కాళ్ళు నొప్పెదుతున్నా వీధిలోకి పరుగందుకున్నాడు రవి. బూదవ్వ తిడుతూ అరుస్తోంది. అవేవీ వాళ్ళకు తాకుతున్నట్టు లేదు. లక్ష్మి కళ్ళు వికసించాయి. పుస్తకాలు అక్కడే పడేసి అన్నయ్య వెంట పరిగెత్తింది. "నాకు చాకిలెటు" అని ఏడ్పులోనే రాగం తీస్తూ ఆనంద్ వాళ్ళ వెంటపడ్డాడు.

* * *

పదిహేను రోజులు గడిచిపోయాయి. రోజురోజుకు మరీ కష్టమవుతోంది. నాన్న దగ్గరినించి డబ్బా రాలేదు. ఉత్తరమూ లేదు. 'నేనే ఓ సారి పోయివస్తా, రైలుచార్జిలిమ్మని' రవి శతపోరుతున్నాడు. అలా మరో పదిహేను రోజులు గడిచిపోయాయి. ఇక బూదవ్వకు వున్న ఆ ఒక్క బిందెని కుదవబెట్టక తప్పలేదు.

ఆపూట తమ్ముడూ, చెల్లీ బడికిపోయాక పాతిక రూపాయలు రవి చేతిలో పెట్టింది బూదవ్వ. ఇక తనతో కాదని ముగ్గుర్నీ అక్కడికే పంపేయాలనిపిస్తోంది. అయినా ఆఖరు ప్రయత్నం చేస్తోంది.

"మీ నాన్న దగ్గరికెళ్ళి పైసలు తీస్కత్తనంటివిగదరా!"

సంతోషంతో ఎగిరి గంతేశాడు రవి. "నీయవ్వ అప్పట్నుంచి చెప్పలేదేందే?"

"వాళ్ళిద్దరుగూడ నీతోటి వస్తనంటే ఎట్లరా?"

అమ్మమ్మ సమయస్ఫూర్తిని మనసులోనే మెచ్చుకున్నాడు రవి. గబగబ తయారయి బయల్దేరాడు.

"ఉన్నొక్క బిందెగూడ కుదవెట్టిన్నని చెప్పుడు మర్సిపోయేవు. ఎట్లన్నజేసి ఓ మున్నూరన్న ఆదుక్కురాకపోతే ఈ అప్పులు తేరయి. మీ సదువులు నడువయి. మున్నూరుకు ఒక్క పైస తక్కువిచ్చినా మిమ్ములందర్నీ అక్కడికే పంపిస్తనన్నదని చెప్పు."

అలాగేనని తల ఆడిస్తూ నిక్కరు పైకి లాక్కుంటూ పరుగులాంటి నడకందుకున్నాడు రవి.

"జాగర్తరా! తెల్వకుంటే ఎవలనన్న అడిగి బండెక్కు."

ఉత్సాహంగా తలవూపుతూ దగ్గరిదారిగుండా స్టేషన్ చేరాడు రవి.

రైలు బండి దిగేసరికి వొంటిగంటయింది. ఇక నడవాలి దారి మధ్యలో ఓ ఎడ్లబండి కలిసింది. అతను బండెక్కించుకుని వూర్లో దింపేసి ముందుకు పోయాడు. ఇల్లు కనుక్కుని యింటికి చేరేసరికి రెండు దాటి పోయింది.

ఇంటిముందు బావికాడ నీళ్ళుచేదుతోన్న అమ్మని చూస్తూనే ఎక్కడలేని ఉత్సాహం ఒక్కసారిగా పెల్లుబికింది. "అమ్మా!"

తల్లి ఆశ్చర్యపోయింది. ఇంత చిన్న పొలగాడు ఒక్కడు ఎట్లా జాడదీసుకొని వొచ్చాడో! గబగబా బొక్కెన లాగేస్తూ అంది.

"ఎప్పుడచ్చినవ్‌రా ? ఎట్లచ్చినవ్‌రా ? ఒక్కడివే అచ్చినవా? కంకబద్దోలె గిట్లయిపోయినెంరా?" కదుపులోకి పొదువుకుంది. వొళ్ళంతా ఆప్యాయంగా పుణికింది. తల్లి కళ్ళల్లో నీళ్ళు సుళ్ళుతిరిగాయి.

ఒళ్ళంతా బాగా రుద్ది తలస్నానం చేయించింది. అన్నం వడ్డించి కొడుకునే చూస్తూ కూర్చుంది సమ్మక్క. ఆకలిగా ఆవురావురని తింటున్నాడు రవి. ఇంటికాడివిషయాలు ఒక్కొక్కటే అడిగింది సమ్మక్క. వాడు చెప్పే ఒక్కోమాటా గుండెని మెలిపెడుతోంది. కొంగుతో కళ్ళొత్తుకుంది అమ్మని చూసి రవికీ దుఃఖం పొంగుకొచ్చింది కంచం పక్కన పెట్టేశాడు.

అంతకుముందు ఆ యిల్లు ఎలా వుండేదోగానీ రవి రాకతో ఆ యింట్లో చావుకళ ప్రవేశించింది. ఆ రాత్రి ఎవరికీ అన్నం సయించలేదు. రవికి నాన్నంటే కోపంగా వుంది. ఏదేదో అడగాలని వుంది కాని భయం. రాజయ్య కిదేమీ తెలియదు. బతిమాలుతూ అన్నం తినిపించబోయాడు. ఆకలి లేదంటూ అలిగాడు రవి.

"ఇక్కడమాత్రం ఏముందిరా? అన్నీ సరుదుకొని రేపో మాపో అందరం అక్కడికే పోదాంరా!"

రవి కళ్ళు సంతోషంతో మెరిశాయి. అంతలోనే అనుమానం తగిలి మళ్ళీ తండ్రికేసి చూశాడు. అలా తండ్రి ఎన్నిసార్లన్నాడో లెక్కేలేదు. ఉత్తరాల్లోనూ యిలాగే రాసేవాళ్ళు. రాజయ్య మళ్ళీ ఎంతో నమ్మకంగా చెప్పడంతో చాలారోజుల తర్వాత కోడిగుడ్డు కూరతో సుష్టుగా భోంచేసి నిద్రపోయాడు రవి.

సమ్మక్క వెక్కివెక్కి ఏడుస్తోంది. అప్పటిదాకా అదిమిపట్టుకున్న రాజయ్యకూ దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికింది.

ఎటుచూసినా ఏమున్నది? పుట్టిన్నించీ పుట్టెడు కష్టాలు. తమ బతుకంతా యింతే. చిక్కగా పరుచుకున్న నిరాశా చీకటితప్ప యింకేం మిగిలింది? ముగ్గురు పిల్లల్ని వదిలి ఈ దేశంకాని దేశంలో బతకాలని ఎవరు చెప్పారు ? అంతా తమ తలరాత? క్షణకాలం సంగం యిచ్చిన సంతోషం ఎపుడో ఎగిరిపోయింది. తమ జీతాలు కూలీలు పెరిగాయని ఎంత పొంగిపోయారో అంతకు రెట్టింపు బాధలొచ్చిపడ్డాయి. అందరుకల్సి దున్నుకున్న బంజర్లో తమకూ అర ఎకరం వచ్చింది. అది సాపుచేసి రెండుసార్లయినా జొన్న పండించారో లేదో దాంటోపాటు గుడిసెకూడా వదిలి యిలా పారిపోవాల్సి వచ్చింది. పోలీసు స్టేషన్లూ చిత్రహింసలూ, జైళ్ళూ కోర్టులూ ఎన్నని? ఏపూటది ఆపూట సంపాయించుకొంటేగాని కడుపునిండదు. ఎక్కడికని తిరగడం ? ఎన్ని ఖర్చులని భరించడం ? చెల్లెలు బతుకెట్లయిపోయెనో! తమ జాడగురించి వాల్లనెన్ని కష్టాలపాలు జేస్తున్నారో! ఇక ఏమున్నది? అంతా అయిపోయె.

పెద్దోన్ని చదివించడం యిక తమతో ఏమవుతుంది? వీడు ఏద్దైనా పని చూసుకుంటే బావుండు. అక్కన్నే ఏదయినా కార్ఖానాలో వుంచితే మెకానిక్కన్నా అవుతాడు. కాని వీనితో చదివినకాడికి చాలులేరా అని చెప్పడానికి అదోరకం సంకోచం. వీడు ఆమాటకు ఎలాగూ తిరగబడతాడేమోనని భయం. అలా ఎవరి మనస్సులో వాళ్ళు ఆలోచిస్తూ ఎపుడు నిద్రపోయారో.

* * *

అలాయిలా చేసి అయిదు రోజులు గడిచిపోయాయి. ఈ కొద్ది రోజులకే రవి ముహం కొంచెం నిగనిగలాడుతోంది. రవికి కొంచెం హాయిగానే వుంది. కాని అక్కడ తనకోసం ఎంత ఎదురుచూస్తున్నారో బెంగగా వుంది. నాలుగో రోజుకే ముళ్ళమీద కూర్చునట్టుగా అయిపోయింది. ఇటుచూస్తే నాన్న పైసల జాడకు తిరుగుతున్నట్టే లేదు. రోజుకోతీరుగా పైసలు దొరుకలేదని కథలు చెప్పుకొస్తున్నారు.

రాజయ్య యిలా రోజులు గడవాలనే వాయిదాలు వేస్తున్నాడు. ఇంకో రెండుమూడు రోజులు యిలాగే చేసి "పైసలు దొరికేదాకా వుత్తగా వుంటే ఏమస్తదిరా! నాతో యిటుక పనికి రారా" అని తల్లినోటినుంచి అనిపించాలని వుంది. అట్లాగే రోజులు గడిస్తే చదువు ఆగిపోక ఏం చేస్తుందిలే – అని ఆలోచిస్తున్నాడు రాజయ్య.

రోజూ రేపు మాపు అని వాయిదా వేయడంవల్ల కనీసం ఉత్తరమయినా రాయకపోతినే అని రవికి బాధగా వుంది. తమ్ముడు, చెల్లెలు ఎంత ఏడుస్తున్నారో ఇటు చూడవోతే నాన్నకు తన చదువుమీద పట్టింపున్నట్టే లేదు. అమ్మమ్మ వుత్తుత్తగా 'చదువు బందువెట్టిస్తరా' అన్న ముచ్చటను నాన్నకు చెప్పడమే పాపమైపోయినట్టుంది. నాన్న నిజంగానే చదువు బందుపెట్టిస్తదా ఏంది? చూడవోతే అట్లే కనపడ్తోంది. అయిదు రోజులు బడిపోయె. ఎన్ని పాఠాలు పోయెనో. ఇక లాభంలేదు అని అయిదో రోజు రాత్రి ఖరాఖండిగా అమ్మని నిలదీశాడు రవి.

"నీయవ్వ! ఏమనిపిస్తందే నీకు. అక్కడ వాల్లు నాకోసం ఎంత ఏడుస్తున్నరో. నువ్వు పైసలిస్తవా లేదా ? నేను ఎట్లన్నజేసి రేప్పొద్దున్న పోత. నాకిక్కడ వుండ బుద్దయితలేదు."

ఆ రోజు – ఆ పూట పని మానేసి యింట్లోనే వుండిపోయాడు రాజయ్య. ఖర్చులకోసం అంటూ వందరూపాయలు రవి చేతిలో పెట్టాడు 'ఇవ్వేనా? అమ్మమ్మ యింక ఇన్నూరు పట్టుకరమ్మన్నది' అని అందామనుకున్నాడుగానీ తండ్రిముందు రవికి నోటమాట పెగల్లేదు. జాగ్రత్తగా వాటిని జేబులో పెట్టుకున్నాడు రవి. పోతనని బయలేర్దాడు. తల్లి కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"అరేయి తమ్ముడు బడికిపోనని ఏడిస్తే పోకపోతేమానెగని కొట్టకుర్రి కొడుకా."

రవికీ కళ్ళనీళ్ళు తిరిగాయి. మళ్ళీ ఎప్పుడో కలవటం!

రవివెంట తండ్రికూడా స్టేషన్‌దాకా వచ్చాడు. బండి ఎక్కించి ఓ డజను అరటిపళ్ళు కొని రవి చేతిలో పెట్టాడు రాజయ్య. ఇవి కొనివ్వడానికే నాన్న ఈపూట పని పోగొట్టుకున్నాడని రవికి తెలియదు. బండి కదులుతుంటే కళ్ళనీళ్ళతో మౌనంగా సాగనంపాడు తండ్రి.

* * *

రవి కాజీపేట చేరేసరికి రాత్రి ఏడవుతోంది. ఇంట్లో అందరూ రవికోసం ఎదురుచూస్తున్నారు. దారితప్పెనో, ఏమయ్యెనో తెలియక కనపడితే చెప్పమని అందరికీ చెపుతోంది బూదవ్వ. అయిదోరోజు కార్డు కూడా రాయించి వేసింది. మరోపక్క అందరూ కల్సి వస్తాననుకోవడం వల్ల ఆలస్యమైందేమోనని ఊహిస్తున్నారు. రవిని చూసి ఆనందు, లక్ష్మి వురుక్కుంటూ ఎదురొచ్చారు. అరటిపళ్ళు లాక్కొని అమ్మమ్మకు తానే ముందు చెప్పాలని ఆనందు మళ్ళీ యింటి కేసి పరిగెత్తాడు. లక్ష్మికి అన్నరావడం ఆనందంగానూ వుంది. తనను తీసికెళ్ళనందుకు దుఃఖంగానూ వుంది. దీనంగా అడిగింది.

"అమ్మా నాన్నా ఎప్పుడస్తరటనే?"

రవికి అబద్దం ఆడ్డానికి నోరురాలేదు. అయినా అబద్దం చెప్పకతప్పలేదు.

"వారం రోజులల్ల వస్తరట."

లక్ష్మి ఎగిరి గంతేసింది.

వందరూపాయల్ని రెండుసార్లు లెక్కపెట్టుకుంది బూదవ్వ. కనీసం రెండువందలైనా పంపుతారనుకుంది. బాధగా నిట్టూర్చింది.

అన్నం వడ్డిస్తూ అదీయిదీ చెపుతోంది బూదవ్వ.

"నువ్వు పోయిన్నాడే ఎంకన్నను పోలీసోల్లు పట్టుకుపోయి(న్రురా."

రవికి ఆశ్చర్యమూ భయమూ కలిగాయి. మొన్నటి ఊరేగింపుకు నాయకత్వం వహించింది వెంకన్ననే. తననుగూడా పట్టుకుపోతారా!

"ఎందుకటనే ?"

"ఏమో తెలువదు."

"యిడ్సిపెట్టి(న్రా?"

"తెలువదిరా"

భయంతో కొంతసేపు ఏమీ మాట్లాడలేదు రవి.

"అన్నం యిడ్సిపెడితివేందిరా?"

లేచిపోతున్న రవికేసి బూదవ్వ బాధగా చూసింది. పొల్లడు నాలుగు రోజులకే ఎట్ల జేస్తున్నాడో చూడు. అక్కడ కొంచెం మంచి మంచి కూరలు తినివుండాలె.

అదేమీ కాదన్నట్టు "మల్లచ్చి తింటనే" అంటూ బయటకు నడిచాడు రవి. వెతకపోయిన తీగ కాలికి తగిలినట్లు ఎదురయ్యాడు వెంకన్న.

"నీకోసమే వస్తున్న. ఎప్పుడచ్చినవ్? మీ అమ్మమ్మ నీకోసం బాగా బెంగటిలిందట" అంటూ నవ్వాడు వెంకన్న.

"అదిసరేగని నిన్నెందుకు పట్టుకపోయి(న్రు? మొన్నటి సమ్మె గురించా ? ఎప్పుడు యిడ్సిపెట్టి(న్రు?"

"ఇవ్వాల్లనే పగటేల యిడ్సిపెట్టి(న్రు. ఇంటికి రాంగనే నీముచ్చట తెల్సింది. ఏమైపోతివో అని వురికస్తున్న."

"అసలెందుకు పట్టుకపోయినట్టు?"

"ఏమో తెల్వదు. ఈ ఎస్సయి కొత్తగ వచ్చిండట. వాల్ల గురించి వీల్ల గురించి అడిగిండు. నాకు ఎవలు తెల్వరని చెప్పిన." అంటూ జరిగిందంతా చెప్పుకొచ్చాడు వెంకన్న.

"ఆఖరికి ఏమన్నడంటే 'బిడ్డా! ఎవలు తెల్వదని చెప్పినవ్. వాల్ల తోటి తిరిగినట్టు కనవడెనా బొక్కలుండై' అని అన్నడు" అని నవ్వాడు వెంకన్న.

"మరి యికనుంచి ఎట్ల?"

"నువు లేవా?"

ఆ మాటకు ఒకపక్క గుబులైంది రవికి. మరోపక్క చెప్పలేనంత సంతోషమైంది. ఆ ఒక్కమాట రవిలో ఎంత ఆత్మవిశ్వాసాన్ని కలిగించిందో చెప్పడానికి మాటలు చాలవు.

అలా రెండేళ్ళు గడిచాయి.

ఆపై మరో ఏడుకూడా గడిచిపోయింది.

* * *

రవి కథ చెప్పడం పూర్తిచేసేసరికి చంద్రుడు పూర్తిగా పడమటికి వంగిపోయాడు. గాఢనిద్రలో అడవి మౌనంగా వుంది. గంభీరంగానూ వుంది. చల్లగాలి బాగా వీస్తోంది. ఎండుటాకులు గలగలమంటూ కొట్టుకొస్తున్నాయి. ఎక్కన్నించో నక్కల అరుపులు వినిపిస్తున్నాయి.

సాభిప్రాయంగా ఓసారి అందరికేసి కలయజూశాడు రవి. అయిదుగురు యింకా చెప్పమన్నట్టు ఆసక్తిగా చూస్తున్నారు. ఒకరు సగంనిద్రలో యధాలాపంగా ఊఁకొడుతున్నారు. ఇద్దరేమో మోకాళ్ళమీద తల అన్చి అలానే నిద్రపోయినట్టున్నారు. మరొకరు కాళ్ళు చాపుకొని ఆవలింతలు తీస్తున్నారు.

"అయితే యిపుడు మీ అమ్మానాన్నలు ఎక్కడున్నారు?" ఆసక్తిగా అడిగాడు గంగాధర్.

"ఇపుడు మల్ల కాజీపేటకే వచ్చిన్రు. మా అమ్మమ్మకు చూపుపడిపోయి మంచాల వద్దది. అమ్మ మూన్నాలుగు యిండ్లల్ల పాచిపని చేస్తున్నది. నాన్న హమాలి (ముఠా) పని చేస్తున్నడు."

"మరి యిపుడు నిన్ను పనికొమ్మంటలేడా మీనాన్న ? "

" ఈనదుమ నేను యింటికి సరిగ్గ పోతలేనుగని" అంటూ అర్థయుక్తంగా వెంకన్న కేసి చూశాడు రవి హోల్‌టైమర్‌గా మారానని చెప్పాల్నా వద్దాఅని !

"కల్సినపుడన్న ఏమంటడు ? మా నాన్న తీరే తిడ్తుంటడా ?"

"ఉహుఁ మొదట్ల నేనుగూడ గట్లనే భయపడ్డ. మొన్నోసారి రోడ్డుమీద ఎదురైన. రెక్కవట్టి యింటికి గుంజుకపోతడనుకున్న. కనిఏమనలే నీగురించి పోలీసోల్లు తిరుగుతున్నర్రా. గట్ల నడిబజాట్ల వడితిరిగితే ఎట్లరా ? అన్నాడు. జేబుల వున్నకాడికి తీసి నా చేతిల వెట్టిండు. గప్పుడు నిజంగా నాకు ఎంత సంతోషమైందంటే.." తండ్రి ఆప్యాయత రవి గొంతులోకి దిగిందేమో మరి మాట పెగల్లేదు. తమని ఊరినించి తరిమి కొట్టిన రాజ్యహింస కళ్ళముందు కదిలినట్టయింది.

"సంగం పని అయిపోయిందనుకున్న మీ నాన్నే సంగం ఎక్కడికి పోలేదని. అది గుండెల్లో భద్రంగా వుందని ఎట్లా రుజువుచేసిండో చూడు." అభినందిస్తున్నట్టుగా అన్నాడు గంగాధర్.

"అయితే నువ్వు ఆ పల్లె పిల్ల వేరువే. మా విప్లవ విద్యార్థి సంఘం చెట్టు పిందెవు కావన్న మాట!" ఈ విషయం అప్పుడే తోచినట్టు నవ్వుతూ అన్నాడు వెంకన్న.

ఆ మాటల్తో రవి కళ్ళల్లో ఏదో తళుక్కుమని మెరిసి మాయమైంది. సరికొత్త ధైర్యం గుండెల్లో ప్రవేశించింది.

నక్కల కూతలు అంతకంతకు దూరమవుతున్నాయి. పల్లెనించి మేకల అరుపులు లీలగా కన్పిస్తున్నాయి. ఒకటి తర్వాత ఒకటి కొక్కొరోకో కూతలు పల్లె అంతటా అదేపనిగా వినిపిస్తున్నాయి.

"లేంద్రి లేంద్రి" అంటూ నిదప్రోయినవాళ్ళను తట్టి లేపాడు వెంకన్న. వెంకన్న చేతిలోని కంజెర ఒక్కసారిగా గల్లుమని మోగింది. ఆకలి గొంతుతో "ఎవరీ పిల్లలమ్మ" అంటూ కొత్త ఉత్సాహంతో శ్రావ్యంగా ఎత్తుకున్నాడు రవి, అందరు కోరస్ అందుకున్నారు.

* * *

ఆ రోజులు ఈ రోజులు కావు. ఆ రోజుల పెద్దగీత చిన్నగీతగా కన్పించడం మొదలై చాలాకాలమైపోయింది. అప్పటి కష్టాలు యిపుడు మధురంగానే వుంటాయి మరి.

**("పునాదిరాళ్ళు" పేరుతో - అరుణతార మాస పత్రిక, జూన్ 1988)**